సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● కలెక్టర్ ఇలా త్రిపాఠి

ప్యాకో మిషన్ ద్వారా కంటి పరీక్ష చేయించుకుంటున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ సిటీ, ఫిబ్రవరి 22 : సీజనల్ వ్యాధులపట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. కనగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఆమె సందర్శించారు. పీహెచ్‌సీకి ఇటీవల మంజూరైన ప్యాకో యంత్రాన్ని పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో వైరస్ సంబంధిత వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. కంటి చూపు మెరుగు పరిచేందుకు మండల కేంద్రానికి ప్యాకో మిషన్ మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ పుట్ల శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ వేణుగోపాల్‌రెడ్డి, పీహెచ్‌సీ డాక్టర్ రామకృష్ణ, రమణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా ఉద్యమించాలి

● వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగయ్య

సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్రఅధ్యక్షుడు నాగయ్య

రామగిరి, ఫిబ్రవరి 22: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రైతులను, పేదలను, కార్మికులను విస్మరించిందని, దీనికి వ్యతిరేకంగా ఉద్యమించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.నాగయ్య పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని దొడ్డి కొమురయ్య భవనంలో సీఐటీయూ, రైతు, వ్యవసాయ, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శనివారం కేంద్ర బడ్జెట్‌పై నిర్వహించిన సెమినార్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో కార్పొరేట్ శక్తులకు పెద్దపీట వేసిందన్నారు. ఉపాధిహామీ పథకంలో కూలీల పనిదినాలు 200కు పెంచాలని, కూలీలకు రోజువారి వేతనం రూ. 600 ఇవ్వాలని దేశ వ్యాప్తంగా పోరాటాలు చేసినా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. హైదరాబాద్ –విజయవాడ డబుల్ ట్రాక్ ఉస్సే లేదన్నారు. బీజేపీ ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాలకే ఈబడ్జెట్ ప్రవేశ పెట్టిందన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నారి అయిలయ్య, రైతు సంఘం నాయకులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదానికి ప్రభుత్వానిదే బాధ్యత

● జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మల్లికార్జున్‌రెడ్డి

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 22 : ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్ద జరిగిన ప్రమాదానికి కాంగ్రెస్ ప్రభుత్వమే బాధ్యత వహించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. సుంకిశాలలో రిట్టెనింగ్ వాల్ కుప్పకూలిన ఘటన మరువకముందే రాష్ట్రంలో మరో దుర్ఘటన జరుగడం కాంగ్రెస్ సర్కార్ వైఫల్యానికి నిదర్శనమన్నారు. కాంట్రాక్టర్లతో కుమ్మక్కై కమిషన్ల వేటలో పర్యవేక్షణ గాలికి వదిలేయడంతో పాటు నాణ్యతా ప్రమాణాల విషయంలో పూర్తిగా రాజీ పడడంతోనే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పైకప్పు కూలిన ఘటనలో గాయపడ్డ వారికి మెరుగైన వైద్యం అందించాలని, లోపల ఇంకా ఎవరైనా కార్మికులు చిక్కుకొని ఉంటే క్షేమంగా బయటికి తీసుకొచ్చేం దుకు చర్యలు చేపట్టాలన్నారు.

గాయపడిన కార్మికులకు మెరుగైన చికిత్స అందించాలి

● సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు తుమ్మల వీరారెడ్డి, నెల్లికంటి సత్యం

రామగిరి, ఫిబ్రవరి 22: శ్రీశైలం సొరంగ మార్గం వద్ద రిటైన్ వాల్ కుప్పకూలి గాయపడిన కార్మికులకు ప్రభుత్వం మెరుగైన వైద్యం అందించాలని సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు తుమ్మల వీరారెడ్డి, నెల్లికంటి సత్యం శనివారం వేర్వేరు ప్రకటనల్లో డిమాండ్ చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంట సమీపంలో ఎడమవైపు సొరంగ మార్గం 14 కిలోమీటర్ల వద్ద ఈ ప్రమాదం చోటుచేసుకుందని తెలిపారు. ప్రమాద సమయంలో అక్కడ పని చేస్తున్న కార్మికుల్లో ఇంకా 8 మంది జాడ తెలియాల్సి ఉందని వెల్లడించారు. ప్రమాద స్థలంలో సహాయక చర్యలు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

చిట్యాల, ఫిబ్రవరి 22 : మండలంలోని వట్టిమర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1998–99 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు శనివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. తమకు చదువు చెప్పిన హెచ్ఎం కంచర్ల మోహన్ రెడ్డి, ఉపాధ్యాయులు కొండకింది అంజిరెడ్డి, నీలంరెడ్డి, కేవీపీ ఆచార్యులు, దూదిగామ స్వామి, నర్రా లావేందర్‌రెడ్డి, శ్రీరాములు, శేఖర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డిని శాలువాతో సన్మానించారు. డాక్టర్ వీరమళ్ల శ్యామ్, నర్సింహ గౌడ్, ఎద్దుల నాగరాజు, మేడి శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, అయిలయ్య, మంజుల, శేఖర్, లక్ష్మీనారాయణ, సురేందర్ పాల్గొన్నారు.

నీటిని అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు : ఏఈ

శాలిగౌరారం, ఫిబ్రవరి 22 : శాలిగౌరారం ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలపై అక్రమంగా మోటర్లు పెట్టి నీటిని తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నీటిపారుదల శాఖ ఏఈ రాములు హెచ్చరించారు. శనివారం ప్రాజెక్టు కుడి కాల్వపై ఏర్పాటు చేసిన మోటర్లను రైతులతో కలిసి పరిశీలించారు. ఆయకట్టు కింద స్థిరీకరించిన పంటకు సరిపడా నీరందాలంటే రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

మండల స్థాయిలోనే సమస్యల పరిష్కారం

● ఎస్పీ శరత్‌చంద్ర పవార్

● డిండి పోలీస్‌స్టేషన్‌లో మీట్ యువర్ ఎస్పీ

ఫిర్యాదు దారుతో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

డిండి, ఫిబ్రవరి 22 : మారుమూల ప్రాంతాల ప్రజల సమస్యలను మండల స్థాయిలోని పరిష్కరిస్తున్నట్లు ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో మీట్ యువర్ ఎస్పీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి ఆయన ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం 26 మంది తమ సమస్యలపై ఎస్పీకి వినతి పత్రం అందించారు. ముఖ్యంగా భూ సమస్యలు, కుటుంబ తగాదాలు, జాబ్ ఇప్పిస్తామని మోసం చేయడం, సైబర్ క్రైమ్ వంటి వాటిపై ఫిర్యాదులు రాగా ఎస్పీ వారితో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలాల్లో సుదూల ప్రాంతంలో ఉన్న బాధితులు జిల్లా కేంద్రానికి వచ్చి ఫిర్యాదు చేయడానికి వ్యయప్రయాసాలకు గురవుతున్నారని, దానికి పరిష్కార మార్గంగా ఇక నుంచి జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్లలో మీట్‌ది ఎస్పీ కార్యక్రమాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. అంతకు ముందు పోలీస్ స్టేషన్ పరిసరాలు, స్థితిగతులు, రిసెప్షన్, స్టేషన్ రైటర్, లాకప్ రూమ్, ఎస్‌హెచ్‌ఓ రూమ్ పరిశీలించారు. కార్యక్రమంలో దేవరకొండ ఏఎస్పీ మౌనిక, సీఐ సురేశ్, ఎస్ఐ రాజు, సిబ్బంది ఉన్నారు.

రోడ్డు ప్రమాద బాధితుడికి కూసుకుంట్ల పరామర్శ

పవన్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

మర్రిగూడ, ఫిబ్రవరి 22 : మండలంలోని వట్టిపల్లి మాజీ సర్పంచ్ ఎడ్ల శ్రీరాములు కుమారుడు పవన్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి శనివారం ఆస్పత్రికి వెళ్లి పవన్‌ను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ మెండు మోహన్‌రెడ్డి, మాల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దంటు జగదీశ్వర్, నాయకులు బచ్చు రామకృష్ణ, రామిడి వెంకటరమణారెడ్డి, ఊరిపక్క నగేశ్, చెర్కు లింగం గౌడ్ ఉన్నారు.

మిర్యాలగూడలో హర్ష టయోటా కార్ల మేళా

మేళాలో ప్రదర్శనకు ఉంచిన హర్ష టయోటా సరికొత్త మోడల్ కార్లు

మిర్యాలగూడటౌన్, ఫిబ్రవరి 22: కార్ల దిగ్గజ కంపెనీ హర్ష టయోటా ఆధ్వర్యంలో మిర్యాలగూడ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం సమీపంలో శనివారం గ్రామీణ మహోత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో కంపెనీకి చెందిన కార్లను ప్రదర్శించారు. ఈ సందర్భంగా హర్ష టయోటా ప్రతినిధి మాట్లాడుతూ వినియోగదారులకు ఉత్తమమైన టయోటా కార్లను అందుబాటులోకి తీసుకురావడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టయోటా కంపెనీకి చెందిన సరికొత్త మోడళ్లు హైరిడర్, గ్లాంజా, టైసర్‌తో పాటు రూమియర్ వాహనాలను ప్రదర్శనకు ఉంచినట్లు పేర్కొన్నారు. అత్యాధునిక టెక్నాలజీతో, కుటుంబ సౌలభ్యం కోసం సౌకర్యవంతంగా కార్లను రూపొందించనట్లు తెలిపారు. వీటితో పాటు వివిధ రకాలైన అధిక నాణ్యతగల పూర్వ యాజమాన్య వాహనాలను సైతం అందిస్తున్నట్లు చెప్పారు. ఈ ప్రదర్శనలో టెస్ట్ డ్రైవ్, టయోటా నిపుణులతో ఇంటరాక్టివ్ సెషన్ కూడా ఉంటాయన్నారు. ప్రతి మోడల్‌పై డీల్స్, తగ్గింపులు కూడా అందిస్తున్నట్లు చెప్పారు. ఈ వేడుకలో ప్రతిఒక్కరూ పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు యాద్గార్‌పల్లి వసతి గృహ సముదాయం ప్రారంభం

● రైతుబంధు సమితి జిల్లా మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

మిర్యాలగూడ రూరల్, ఫిబ్రవరి 22 : మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామంలో బ్రాహ్మణులకు వసతి గృహంతో పాటు అయ్యప్ప స్వామి మాల ధరించిన వారికి వసతి గృహ సముదాయాన్ని రూ.28లక్షలతో నిర్మించినట్లు జిల్లా రైతుబంధు సమితి మాజీ చైర్మన్ చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వసతి గృహ సముదాయ నిర్మాణానికి తన వంతుగా రూ.8లక్షలు విరాళంగా అందించగా.. దాతలు అందించిన రూ.20 లక్షలతో భవనాన్ని పూర్తి చేశామన్నారు. అందుకు సహకరించిన దాతలకు ధన్యవాదాలు తెలిపారు. ఆదివారం నిర్వహించే వసతి గృహ సముదాయ ప్రారంభోత్సవానికి దాతలు, గ్రామస్తులు తరలిరావాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలకు డెస్క్ బెంచీలు అందజేత

పాఠశాలకు డెస్క్ బెంచీలు అందిస్తున్న లయన్స్‌క్లబ్ బాధ్యులు

హాలియా, ఫిబ్రవరి 22 : లయన్స్‌క్లబ్ ఆఫ్ నల్లగొండ స్టార్స్ ఆధ్వర్యంలో కీసర యుగంధర్‌రెడ్డి, భారతి సహకారంతో హాలియా మున్సిపాలిటీ పరిధిలోని ఇబ్రహీంపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు శనివారం 10 డ్యూయల్ డెస్క్ బెంచీలను అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సలహాదారుడు యడవల్లి నరేందర్‌రెడ్డి, క్లబ్ డిస్ట్రిక్ 320 సెక్రెటరీ శివశంకర్‌రావు, సింహాద్రి, ట్రెజరర్ మురళీధర్‌రెడ్డి, సభ్యులు కట్ట అనంతరెడ్డి, అలుగుబెల్లి ఆదిరెడ్డి, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ నల్లబోతు వెంకటయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న కస్తూరి ఫౌండేషన్ సభ్యులు

చిట్యాల, ఫిబ్రవరి 22 : మండలంలోని చిన్నకాపర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు శనివారం కస్తూరి ఫౌండేషన్ చైర్మన్ కస్తూరి చరణ్ స్టడీ మెటీరియల్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. ఎంఈఓ పానుగోతు సైదానాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాలలో..

చండూరు : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల పదో తరగతి విద్యార్థులకు శనివారం పీఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ చెల్లం పాండురంగారావు, పాఠశాల ఎస్ఓ మంజుల, సివిల్ ఇంజినీర్ భూతరాజు ధనలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సుద్దబాయితండా వాసికి డాక్టరేట్

పీహెచ్‌డీ పట్టా అందుకుంటున్న అనితనాయక్

చందంపేట(నేరేడుగొమ్ము), ఫిబ్రవరి 22 : నేరేడుగొమ్ము మండలంలోని సుద్దబాయితండాకు చెందిన కేతావత్ అనితానాయక్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. ఆమె ప్రస్తుతం సోషల్ వెల్ఫేర్ గురుకుల డిగ్రీ కళాశాలలో అధ్యాపకురాలిగా పని చేస్తున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ 'ఇంప్యూరిటీ ప్రొఫైలింగ్ అండ్ స్టెబిలిటీ ఇండికేటింగ్ మెథడ్ డెవలప్‌మెంట్ అండ్ వాలిడేషన్ ఆఫ్ సెలక్టెడ్ డ్రగ్స్' అంశంపై ఆమె చేసిన పరిశోధనకు ఉస్మానియా యూనివర్సిటీ పీహెచ్‌డీ పట్టా అందించింది. అనితానాయక్ పీహెచ్‌డీ పట్టా అందుకోవడంతో భర్త మకట్‌లాల్, తండా వాసులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ

త్రిపురారం, ఫిబ్రవరి 22: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు శనివారం లయన్స్ క్లబ్ ఆఫ్ మిర్యాలగూడ భాస్కర ఆధ్వర్యంలో రూ.10వేల విలువైన పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, స్కేళ్లు, పెన్సిళ్లు అందించారు. ఈ సందర్భంగా సంస్థ చార్టెడ్ ప్రెసిడెంట్ మురహరి మాట్లాడుతూ దాత గుడిపాటి నవీన్, క్రాంతి సహకారంతో పరీక్ష సామగ్రిని విద్యార్థులకు అందించినట్లు తెలిపారు. పదో తరగతిలో 10 జీపీఏ సాధించిన వారికి రూ. 2వేలు అందిస్తానని చార్టెడ్ మెంబర్ బీఎం.నాయుడు ప్రకటించారు. ప్రధానోపాధ్యాయుడు రవికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉరేసుకొని వృద్ధుడి ఆత్మహత్య

● మహిళ దాడి చేయడంతో తీవ్ర వనస్తాపం

నిడమనూరు, ఫిబ్రవరి 22 : మహిళ తనను తిట్టి దాడి చేసిందని మనస్తాపానికి గురైన వృద్ధుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని వెంగన్నగూడెంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కుంటిగొర్లగూడెం గ్రామానికి చెందిన కుంటిగొర్ల ఎల్లయ్య(60)తో పాటు మరి కొందరు వెంగన్నగూడెం గ్రామ శివారులోని మేరెడ్డి వంశీవర్ధన్‌రెడ్డి పత్తి తోటను లీజుకు తీసుకొని గొర్రెలను మేపుతున్నారు. ఈ క్రమంలో తన కోడలిని ఎల్లయ్య లైంగికంగా వేధించాడని ఆరోపిస్తూ కుంటిగొర్లగూడెం గ్రామానికి చెందిన మహిళ శుక్రవారం రాత్రి ఎల్లయ్యను దుర్భాషలాడి దాడి చేసింది. పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ పెడతానని హెచ్చరించి వెళ్లింది. దాంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఎల్లయ్య రాత్రి వెంగన్నగూడెం శివారులోని గొర్రెల దొడ్డి వద్దకు వెళ్లి అక్కడే ఉన్న వేప చెట్టుకు చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం ఉదయం గ్రామస్తులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ గోపాల్‌రావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి కుమారుడు కుంటిగొర్ల శ్రీను ఫిర్యాదు మేరకు ఎల్లయ్యను దూషించిన మహిళపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు బీసీ గురుకుల ప్రవేశ పరీక్ష

మిర్యాలగూడ రూరల్,ఫిబ్రవరి 22 : బీసీ గురుకుల పాఠశాలలో ప్రవేశానికి ఆదివారం నిర్వహించే పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండలంలోని శ్రీనివాస్‌నగర్‌లో నిర్వహిస్తున్న దామరచర్ల సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఉమాదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో 300 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు తమ వెంట హాల్ టికెట్‌తో పాటు, ఆధార్ జిరాక్స్ తెచ్చుకోవాలని సూచించారు.

దేవరకొండలో..

దేవరకొండరూరల్ : మండలంలోని పెంచికల్‌పహాడ్ గిరిజన బాలికల కళాశాలలో ఆదివారం నిర్వహించే వీటీజీ సెట్ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రిన్సిపాల్ కళ్యాణి తెలిపారు. తమ పాఠశాలలో 646 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉంటుందని తెలిపారు. దేవరకొండలోని గిరిజన మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో కూడా ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ప్రియాంక తెలిపారు.

విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి : ఎస్ఐ నరేశ్

మిర్యాలగూడ, ఫిబ్రవరి 22 : విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ నరేశ్ సూచించారు. మండలంలోని తుంగపాడు మోడల్ స్కూల్‌లో శనివారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలతో పాటు బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, మానవ అక్రమ రవాణా, సోషల్ మీడియా, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఏఎస్ఐ తబిత పాల్గొన్నారు.

చపాతీ యంత్రం ప్రారంభం

రామగిరి, ఫిబ్రవరి 22: ఎంజీయూ బాలుర, బాలిక హాస్టల్స్‌లో ఏర్పాటు చేసిన చపాతీ తయారీ యంత్రాన్ని శనివారం ఎంజీయూ హాస్టల్స్ డైరెక్టర్ దోమల రమేశ్ ప్రారంభించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించేందుకు వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ చొరవతో యంత్రాలను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. హాస్టల్ వార్డెన్లు నీలకంఠం శేఖర్, ఆదిరెడ్డి, ఆనంద్, అనిత, రాజలక్ష్మి పాల్గొన్నారు.

యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

● సీనియర్ సివిల్ జడ్జి మంజుల సూర్యవర్

సదస్సులో మాట్లాడుతున్న జడ్జి మంజుల సూర్యవర్

నకిరేకల్, ఫిబ్రవరి 22 : యువత దురలవాట్లకు దూరంగా ఉండాలని, క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానానికి చేరాలని సీనియర్ సివిల్ జడ్జి కుమారి మంజుల సూర్యవర్ సూచించారు. శనివారం నకిరేకల్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మత్తు పదార్థాలకు అలవాటుపడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు. పట్టణ సీఐ రాజశేఖర్ మాట్లాడుతూ ఎక్కడైనా గంజాయి, మాదకద్రవ్యాలు విక్రయించినా, వినియోగించినా వెంటనే 100 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మల్లారెడ్డి, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పి.శంభయ్య, అడ్వకేట్లు బి. ప్రకాశరావు, వి. వెంకన్న, పి. పాపయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

24న ఎంజీయూలో అవగాహన సదస్సు

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వీసీ హుస్సేన్

రామగిరి, ఫిబ్రవరి 22: ఈ నెల 24, 25న ఎంజీయూలో విద్యార్థులకు హెచ్ఐవీ, ఎస్‌టీఐపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు వీసీ ప్రొఫెసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను శనివారం తన చాంబర్‌లో ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అల్వాల రవి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మద్దిలేటి, ఎంజీయూ పీడీ శ్రీనివాస్‌రెడ్డి, పీఓ నీలకంఠంశేఖర్ పాల్గొన్నారు.

రోడ్డు వెడల్పు పనులు త్వరగా పూర్తి చేయాలి

● ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

రోడ్డు పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

చండూరు, ఫిబ్రవరి 22: రోడ్డు వెడల్పు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. శనివారం చండూరు మున్సిపాలిటీలో జరుగుతున్న రోడ్డు వెడల్పు పనులను ఆయన పరిశీలించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని రోడ్లను చండూరు మున్సిపాలిటీ పరిధి వరకు 60 ఫీట్లు వెడల్పు చేయాలని ఆదేశించారు. ఆయన వెంట కొరిమి ఓంకారం,అనంత చంద్రశేఖర్‌గౌడ్, డాక్టర్ కోడి శ్రీనివాసులు, దోటి వెంకటేశ్, నల్లగంటి మల్లేశ్, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థికి ఎమ్మెల్యే బాలూనాయక్ అభినందన

విద్యార్థిని అభినందిస్తున్న ఎమ్మెల్యే బాలూనాయక్

కొండమల్లేపల్లి, ఫిబ్రవరి 22 : మండల కేంద్రంలోని కృష్ణవేణి పాఠశాలకు చెందిన విద్యార్థి అర్జున్‌తేజ్ ఇండియన్ బ్రిలియంట్ ఒలింపియాడ్‌లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించాడు. విద్యార్థిని శనివారం ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ తన క్యాంప్ కార్యాలయంలో అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో యంఏ సిరాజ్‌ఖాన్, ఉట్కూరి వేమన్‌రెడ్డి, గంధం సురేశ్, కృష్ణవేణి పాఠశాల కరస్పాండెంట్ కట్ట వెంకట్‌రెడ్డి, పాల్గొన్నారు.

బంజారాల అభ్యున్నతికి కృషి చేసిన సంత్‌సేవాలాల్

● ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

సేవాలాల్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

అడవిదేవులపల్లి, ఫిబ్రవరి 22: బంజారాల అభ్యున్నతికి ఎంతో శ్రమించిన మహనీయుడు సంత్‌సేవాలాల్ మహారాజ్ అని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని జీలకరకుంటతండాలో నిర్వహించిన సేవాలాల్ జయంత